## సెంట్రల్ నర్సరీ అభివృద్ధి పనులు పరిశీలించిన వీఎంఆర్డీఏ ఎంసీ

**విశాలాంధ్ర-విశాఖ :** వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమీషనర్ కె.ఎస్. విశ్వనాథన్ ఎంవీపీ కాలనీలో సుమారు కోటి రూపాయల వ్యయంతో చేపడుతున్న సెంట్రల్ నర్సరీ అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. రహదారి, ఆఫీసు భవనం, పంప్ హౌస్ నిర్మాణాల ఆకృతుల్లో మార్పులు సూచించారు. నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారు, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ ఎం.బలరామరాజు, కార్యనిర్వహక ఇంజినీర్ మధుసూధనరావు, ఇన్చార్జి డి ఎస్ ఓ శివానీ, ఉప కార్యనిర్వాహణ ఇంజనీర్ విశ్వనాథ్, సహాయక ఇంజనీర్ శ్రీనివాస రెడ్డి, ఆర్కిటెక్ట్ వినాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్..

**విశాఖ జిల్లాలో 87.57 శాతం, ఉత్తరాంధ్రలో 92.40 శాతం ఓటింగ్ నమోదు.**

**ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించిన రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్..**

**జిల్లాలో పోలింగ్ సరళి, ఇతర పరిస్థితులను సమీక్షించిన ఎన్నికల పరిశీలకులు ఎం.ఎం. నాయక్**

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగిసింది. గురువారం ఉదయం 8.00 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4.00 గంటల వరకు జరిగింది. ఉదయం నుంచే అన్ని పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా యంత్రాంగం అన్ని కేంద్రాల వద్దా పటిష్ట ఏర్పాట్లు చేసింది. విశాఖపట్టణం జిల్లాలోని 13 పోలింగ్ కేంద్రాల పరిధిలో 5,529 ఓటర్లు ఉండగా సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 4,842 మంది వారి హక్కును వినియోగించుకున్నారు. ప్రశాంత వాతావరణంలో 87.30 శాతం ఓటింగ్ జరిగింది. ఇదిలా ఉండగా ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల్లో 22,493 మంది ఓటర్లు ఉండగా 20,783 మంది ఓటేశారు. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 92.40 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, విశాఖపట్టణం జిల్లాలో జరిగే ఓటింగ్ సరళిని జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పర్యవేక్షించారు. అలాగే దాబాగార్డెన్స్ పరిధిలోని ప్రేమ హైస్కూల్, ఏయూ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. సహాయక రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ ఎప్పటికప్పుడు పోలింగ్ శాతం వివరాలను సేకరించి రిటర్నింగ్ అధికారికి నివేదించారు.

### జిల్లాలోని పరిస్థితిని సమీక్షించిన ఎన్నికల పరిశీలకులు ఎం.ఎం. నాయక్..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియను, ఇతర పరిస్థితులను పరిశీలకులు ఎం.ఎం. నాయక్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ తో కలిసి ఏయూ ప్రాథమిక పాఠశాల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. అప్రమత్తంగా ఉంటూ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూంకు చేరుకొని జిల్లా, ఉత్తరాంధ్ర పరిధిలోని ఇతర జిల్లాల్లో జరుగుతున్న పోలింగ్ తీరును పర్యవేక్షించారు. రిటర్నింగ్, సహాయక అధికారులకు, ఆయా జిల్లాల్లో పరిధిలోని ఏఆర్వోలకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

### ఉత్తరాంధ్ర పరిధిలో 92.40 శాతం...

### విశాఖ జిల్లాలో 87.57 శాతం...

ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా 20,783 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 92.40 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా 5,529 ఓటర్లు కలిగిన విశాఖపట్టణం జిల్లాలో 4,842 మంది వారి హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయానికి 87.57 శాతం ఓటింగ్ నమోదైందని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం ఆంధ్రా యూనివర్సిటీ ప్రాథమిక పాఠశాలలో జరిగిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కనీస వసతులు కల్పించామని చెప్పారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. అన్ని జిల్లాల పరిధిలో పోలింగ్ నెమ్మదిగా ప్రారంభమైనప్పటికీ క్రమేణా జోరందుకుందని వివరించారు. విశాఖపట్టణం జిల్లాలో సున్నితమైన కేంద్రాలు ఎక్కడా లేవని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులుగా కలెక్టర్ చెప్పారు. మార్చి 03వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు.

# విశాఖలో ప్రారంభమైన 2024 స్వచ్ఛ సర్వేక్షన్

**నగర ప్రజల అభిప్రాయం ముఖ్య భూమిక**

**జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ**

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:** విశాఖ నగరంలో జీవీఎంసీ పరిధిలో 2024 సంవత్సరంనకు సంబంధించి స్వచ్ఛ సర్వేక్షన్ ప్రారంభమైందని, విశాఖ నగర ప్రథమ స్థానం లక్ష్యంగా జీవీఎంసీ యంత్రాంగం కృషి చేస్తుందని, విశాఖ నగర ప్రజల అభిప్రాయ సేకరణ ముఖ్య భూమికని, అందుకు విశాఖ నగర ప్రజలు తమ అమూల్యమైన అభిప్రాయాలను స్వచ్ఛ సర్వేక్షన్ లో తెలియపరచాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్ చార్జ్ కమిషనర్ ఎమ్.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ గురువారం పత్రికా ప్రకటన ద్వారా నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ నగరంలో 2024 సంవత్సరం స్వచ్ఛ సర్వేక్షన్ ప్రారంభమైందని, అందుకు సంబంధించి విశాఖ నగరంలో నిత్యం ప్రతి ఇంటి నుండి విభజించిన వ్యర్థాల సేకరణ, తరలింపు, రోడ్లు, కాలువల పరిశుభ్రత, మార్కెట్లు, బజార్లు, పార్కులు,ఉద్యానవనాలు, ఇతర బహిరంగ ప్రదేశాలలో అధికారుల పరిశుభ్రతా నిర్వహణ, రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్.ఆర్.ఆర్) కేంద్రాలు వాటి వినియోగం గురించి ప్రజలకు అవగాహన, పబ్లిక్ టాయిలెట్లు పరిశుభ్రత, వాటి నిర్వహణ, పారిశుధ్య పనుల ఫిర్యాదులపై అధికారుల స్పందన, పనితీరుపై ప్రజల సంతృప్తి తదితర అంశాలపై విశాఖలో స్వచ్ఛ సర్వేక్షన్ కొరకు పలు ప్రశ్నలకు గానూ ప్రజల నుండి ప్రజా అభిప్రాయ సేకరణ ప్రారంభమైందన్నారు. ఆయా ప్రశ్నలపై ప్రజాభిప్రాయ సేకరణ స్వచ్ఛ సర్వేక్షన్ బృందం నేరుగా ముఖాముఖిగా, అలాగే స్వచ్ఛత యాప్, వెబ్సైట్ లింకు ద్వారా సేకరిస్తుందన్నారు. ఇప్పటికే విశాఖ నగరం దేశంలోనే పరిశుభ్ర నగరంగా 4వ స్థానాన్ని పొంది ఉన్నదని, విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి దిశగా తీర్చిదిద్దుటకు జీవీ ఎంసీ యంత్రాంగం నిత్యం ప్రజలకు సేవలు అందిస్తూ, మౌలిక సదు పాయాలు కల్పిస్తూ, నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దు తుందన్నారు. విశాఖ నగర అభివృద్ధి దృష్ట్యా నగర ప్రజలు ఈ ప్రశ్నలకు స్వచ్ఛ సర్వేక్షన్ బృందం నేరుగా ముఖాముఖిగా మీ వద్దకు వచ్చినప్పుడు అలాగే స్వయంగా మీరే ఈ https://sbmurban.org/feedback లింకు నందు గాని లేదా స్వచ్ఛతా మోహువా యాప్ ద్వారా గాని మీ ఫోన్లో ఓటిపి ( ఒన్ టైమ్ పాస్ వర్డ్) ను నమోదు చేసి తమ అమూల్యమైన అభిప్రాయాలను తెలిపి విశాఖ నగర అభివృద్ధికి, విశాఖ నగరం దేశంలోనే ప్రథమ స్థానం లక్ష్యసాధనకు సహకరించాలని అదనపు కమిషనర్ కోరారు. ఈ విషయమై ప్రజల అవగాహన కొరకు వార్డు కార్యదర్శులు అన్ని సచివాలయాల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సహకారం అందిస్తున్నారని, వారి సేవలను నగర ప్రజలు వినియోగించుకుంటూ స్వచ్ఛ విశాఖ లక్ష్యసాధనకు సహకరించాలని అదనపు కమిషనర్ విశాఖ నగర ప్రజలకు పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

## నేత్ర పర్వంగా ఆర్జిత సేవలు

**విశాలాంధ్ర-సింహాచలం:** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వాతి నక్షత్ర హోమం, పిదప స్వర్ణ పుష్పార్చన, నిత్యకళ్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి వి త్రినాధరావు, ప్రధాన అర్చకులు అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆదేశాల మేరకు అర్చక స్వాములు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపము లో వేదికపై అధిష్ఠింపజేసి వేద మంత్రాలు నాద స్వర మంగళ వాయిద్యాల నడుమ స్వాతి నక్షత్ర హెూమం, శ్రీ స్వామి వారి స్వర్ణ పుష్పార్చన ఆర్జిత సేవలు నేత్రపర్వంగా జరిగాయి. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవింద రాజ స్వామిని మండపంలో అధిష్టింప జేశారు. పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో కార్యక్రమానికి కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళా శాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## అప్పలరాజు ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న బెహరా

**విశాలాంధ్ర -గోపాలవట్నం:** గ్రేటర్ విశాఖ 91వ వార్డు పాత గోపాలపట్నంలో నివాసం ఉంటున్న ఓడిబోయిన అప్పల రాజు వాల్తేరు టీబీ హాస్పిటల్ లో ఇటీవల అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నందు వలన వైసీపి మండల అధ్యక్షులు బెహరా భాస్కరరావు పరామర్శించి, అతని ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని, తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

**విశాలాంధ్ర-పెందుర్తి:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పెందుర్తిలో ప్రశాంతంగా ముగిసింది. 92 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు ప్రకటించారు. పాకలపాటి రఘువర్మకు మద్దతుగా టిడిపి జనసేన నాయకులు బూత్ నెంబర్ 113 సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్ వద్ద పెందుర్తి ఎమ్మెల్యే వంచకర్ల రమేష్ బాబు పోలింగ్ సరళని పరిశీలించారు. ఆయన వెంట జీవీఎంసీ తెలుగుదేశం పార్టీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ,97 వార్డ్ తెలుగుదేశం పార్టీ నాయకులు సేనాపతి శంకర్రావు ,94 వార్డ్ కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ,93 వార్డ్ కార్పొరేటర్ రాపర్తి కన్న ,88 వార్డ్ కార్పొరేటర్ మొల్లి ముత్యాలు , వేగి దేవకర్ ,రెడ్డి నారాయణరావు , సుఖవాసి అజయ్, వార్డ్ అధ్యక్షులు సేనాపతి సోమశేఖర్ ,దాడి సంతోష్, గంటల దివాకర్, దాట్ల మధు, అవగెడ్డ అప్పలనాయుడు ,హర గోపాల్, నాగ సుధ, మండల పార్టీ అధ్యక్షులకు కరక దేవుడు కోరుపోలు రాము నాయుడు, ఎంపీటీసీ గోళ్ళవిల్లి రమణ, నగేష్, రాజేంద్ర ప్రసాద్, దారపు సత్యనారాయణ, గల్లా శ్రీను, ఎల్లపు శ్రీను, గొర్ల అప్పారావు మొదలగు పెందుర్తి మండలం ముఖ్య నాయకులు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వ్యతిరేకత తట్టుకోలేకనే అక్రమ అరెస్టులు

**మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్**



**విశాలాంధ్ర-విశాఖ సిటీ:** ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేకనే రెడ్‌బుక్ రాజ్యాంగం నడుపుతూ వైసిపి నేతలపై అక్రమ కేసులు పెడు తున్నారని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పోసాని అరెస్టును ఖండిస్తూ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మీడియాతో మాట్లాడారు. పవన్, లోకేష్ ఇద్దరి దగ్గర రెడ్‌బుక్స్ ఉన్నాయని, భారత రాజ్యాంగం అనుసరిస్తూ నిర్వర్తించాల్సిన బాధ్యతలను తుంగలో తొక్కుతూ కేవలం కక్షపూరిత రాజకీయాలకే పరిమితమయ్యారని మండిపడ్డారు. పోసాని అరెస్టు పవన్ కళ్యాణ్ ఆలోచన అని ఆరోపించారు. ప్రఖ్యాతి చెందిన ఆంధ్రప్రదేశ్ నేడు చంద్రబాబు కబంధ హస్తాలలో ప్రపంచవ్యాప్తంగా ఇమేజ్ డామేజ్ అవుతుందని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వాళ్లే తగిన గుణపాఠం చెప్తారని వాసుపల్లి గణేష్ కుమార్ వెల్లడించారు. ఒకటి మాత్రం గుర్తు పెట్టుకోవాలని రాజ్యాంగానికి విరుద్ధంగా నడిచే వారిపై ఎంతటి వారినైనా జగన్మోహన్ రెడ్డి 2.0 లో విడిచి పెట్టేదే లేదన్నారు. భవిష్యత్తులో ఇంతకంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని గుర్తుపెట్టుకోవాలన్నారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టిన ఎదిరించి నిలబడతామని, తమ వెనుక జననేత జగన్ మోహన్ రెడ్డి అనే మహాశక్తి ఉందని అన్నారు. ఆంధ్రప్రదేశ్లో అసలు పరిపాలన జరుగుతుందా అని ప్రశ్నించారు. సామాన్య ప్రజలకి అందని సంక్షేమ ఫలాలు, అభివృద్ధినోచుకొని ఆంధ్రప్రదేశ్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం మాటే లేదన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంటే కేంద్రమంత్రి అమిత్ షా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర పరిణామాలపై కేంద్రం జోక్యం చేసుకొని కట్టడి చేయకుంటే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని వాసుపల్లి గణేష్ కుమార్ హెచ్చరించారు.

## గీతంలో ఫ్రాన్స్ విద్యాలయాల సందడి

**విశాలాంధ్ర -మధురవాద:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఫ్రాన్స్ దేశానికి చెందిన విశ్వవిదాల యాలతో ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం తేది నిర్వహించారు. దాదాపు 16 ఫ్రాన్స్ విశ్వవిద్యాలయాల నుంచి అకడమిక్ ప్రతినిధులు దీనికి హజరయ్యారు. చూజ్ ఫ్రాన్స్ టూర్ పేరిట జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల ప్రతినిధులు విద్యార్థుల సందేహలను నివృత్తి చేశారు. ఉన్నత విద్యా రంగంలో ఫ్రాన్స్ విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్, అవి నిర్వహిస్తున్న కోర్సులపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఫ్రాన్స్ ప్రతినిధి బృందం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు వారుతో సమావేశం అయ్యారు. జిసిజిసి డైరక్టర్ వంశీకిరణ్, డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ బి.రవికాంత్ సంధానకర్తగా వ్యవహరించారు.

## మహా శివరాత్రి సందర్భంగా తీర ప్రాంతాలలో సీపీ శంఖబ్రాత బాగ్చి భద్రతా చర్యలు పరిశీలన

**విశాలాంధ్ర-విశాఖ క్రైమ్ :** మహా శివ రాత్రి సందరంగా పోలీసు కమీషనర్ నగర పరిధిలో ప్రముఖ తీరప్రాంతాలైన ఆర్కే బీచ్, రుషికొండ, భీమిలి, యారాడ, అప్పికొండతో పాటుగా భక్తులు పుణ్య స్నానాలా కొరకూ విచ్చేసే అన్ని సముద్ర తీర ప్రాంతాల వద్దా, ప్రముఖ దేవాలయాల వద్దా అవసరమైన అన్ని భద్రతా చర్యలనూ స్వయముగా ఆయా ప్రాంతాలను సందర్శించి, బందో బస్తు ఏర్పాట్లను పరిశీలించారు,సముద్ర తీర ప్రాంతాల వద్ద, ముఖ్యముగా జన సందోహం అధికంగా ఉండే ఆర్కే బీచ్, అప్పికొండ బీచ్ ప్రాంతాల వద్ద తగు జాగ్రత్తలతో ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం కలగకుండా, సముద్ర స్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం బీచ్ పెట్రోలింగ్ వాహనాలతో పెట్రోలింగ్ నిరంతరం చేపట్టారు, రిప్ కరెంటు టెక్నాలజీ ద్వారా సముద్ర తరంగాలలొ జరిగే అనూహ్య మార్పులు గమనిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రిప్ కరెంటు మానిటర్ చేస్తూ మరియు ప్రజలను బీచ్ లోపలికి వెళ్లకుండా ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ , నిరంతరము పరిశీలిస్తూ ప్రజలు సముద్ర కెరటాల బారిన పడకుండా జాగ్రత్తగా పుణ్య స్నానాలు చేయాలని చెప్తూ ప్రజలను ఎప్పటికప్పుడు సౌండ్ సిస్టంతో అప్రమత్తం చేస్తూ, అన్ని ముఖ్య తీరప్రాంతాల్లో డ్రోన్లను వినియోగిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉంటూ భక్తులు ఏటువంటి ఇబ్బందులకు గురికాకుండా పర్యవేక్షణ చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్ పోస్టుల ద్వారా పోలీసు సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, పలు ప్రాంతాలలో పుణ్య స్నానాలు ఆచరిస్తూ సముద్రంలోనికి ప్రమాదకర రీతిలో వెళ్లిపోయిన సుమారు 06 గురు భక్తులను గజ ఈతగాళ్ల సహాయంతో రక్షించారు, జనసంద్రంలో చిన్నారులు తప్పిపోకుండా అధునాతన సాంకేతికత అయిన రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్.ఎఫ్.ఐ.డి) ను వినియోగించి, చిన్నారులు తప్పిపోకుండా భరోసా ఇస్తూ సుమారు 10 మంది చిన్నారులను వారి తల్లి దండ్రులకు అప్పగించారు. నగర కమిషనర్ మాట్లాడుతూ, భక్తులు ప్రశాంతంగా, సురక్షితంగా మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనేలా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

## నేడు ఆదర్శ్ కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్

**విశాలాంధ్ర-పెందుర్తి:** స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సైన్స్ డే సందర్భంగా ఈనెల 28న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం మూడు గంటల వరకు సైన్స్ ఎక్స్పో కార్యక్రమం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎస్ ఈ ఫ్లోరా తెలియజేశారు. కళాశాలలో వివిధ గ్రూపులు చదువుతున్న ఆదర్శ్ విద్యార్థులు వారి మేధోశక్తితో సైన్స్ ఎక్స్పెరిమెంట్స్ తో వివిధ ప్రాజెక్టులు చేస్తారని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఆదర్శ్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ మాట్లాడుతూ ఈ ఎక్స్పో లో ప్రతి స్కూల్ విద్యార్థి, ఈ సాంకేతిక ఎగ్జిబిషన్ ని ఉచితంగా తిలకించాలని, ఉచిత డెంటల్ చెక్ అప్ చేసుకోవచ్చని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. చీఫ్ గెస్ట్ గా పెందుర్తి లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ పద్మావతి పాల్గొని సైన్స్ ఎక్స్పో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని ఏవో రవి బాబు తెలిపారు. సైన్స్ ఎక్స్పో కు ఫిజిక్స్ లెక్చరర్ రమ్య కన్వీనర్ గా వ్యవహరించనున్నారని చెప్పారు.

## సర్ప లింగేశ్వర స్వామి సేవలో కార్పొరేటర్ ముమ్మన

**విశాలాంధ్ర-పెందుర్తి :** జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి నియర్ ఎంఈఎస్ కోలనీలో కొలువై యున్న శ్రీ సర్ప లింగేశ్వర స్వామి సేవలో బిజెపి నేత, స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేవుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ స్వామి వారికి పంచామృతాభిషేక పూజలు చేశారు. ప్రతి నెల అమావాస్య ముందు రోజు స్వామివారి సన్నిధిలో ఆనవాయితీగా నిర్వహించే మహా అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కమిటీ సభ్యులతో కలిసి భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ ఆళ్ళ తాతారావు, బిజెపి నాయకులు కంచిబోయిన వెంకట సంతోష్, ఆలయ ధర్మకర్త, ప్రెసిడెంట్ బి.కామేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ లలిత, సెక్రటరీ రాము, జాయింట్ సెక్రెటరీ కర్రి గోపి కృష్ణ, ట్రెజరర్ లలిత కుమారి, కోలనీ ప్రతినిధులు సింగ్, బాబురావు,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్

**44 మంది ఓటర్లకు - 30 మందికి పైగా అధికారులు - 43 మంది హాజరు 1 గైర్హాజరు.....**

**పోలింగ్ బూత్‌లో తనిఖీలు నిర్వహించిన విశాఖ సీపీ**

**విశాలాంధ్ర-ఆనందపురం:** ఆనందపురం మండలంలో గురువారం నిర్వహించిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ కు పటిష్టంగా ఏర్పాటు చేశామని ఆనందపురం సిఐ వాసు నాయుడుతెలిపారు. గురువారం సాయంత్రానికి 44 మంది ఓటర్ల కు43 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒక్కరు మాత్రమే ఓటు హక్కును వినియోగించు కోలేదని, 30 మంది పురుషులు, 13 మంది స్త్రీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు. అయితే విచిత్రం ఏమిటంటే 44 ఓటర్లకు 30 మందికి పైగా పలువురు అధికారులు

పోలింగ్ నిర్వహణలో పాల్గొన్నారు.

పోలింగ్ సందర్భంగా విశాఖ పోలీస్ కమిషనర్ శంకబ్రత భాగ్చి గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పగడ్బందీగా పోలింగ్ ప్రక్రియ జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. సిపితోపాటు ఏసిపి అప్పలరాజు, తనిఖీల్లో పాల్గొన్నారు. పోలింగ్ స్టేషన్ వద్ద మండల తాసిల్దార్ శ్యాం ప్రసాద్, ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ వాసునాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ శివ, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పోలింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### గోపాలపట్నంలో ప్రశాంతంగా పోలింగ్

**విశాలాంధ్ర-గోపాలపట్నం:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గోపాలపట్నం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఉదయం .8గంటలకు ప్రారంభం అయ్యాయి. గోపాలపట్నం మండలంలో 790 ఓట్లు ఉండగా సాయంత్రం వరకు సుమారుగా 70% ఓట్లు పోలయ్యాయి అని ఎన్నికల అధికారి తెలిపారు.

### పెదగంట్యాడలో ఎన్నికలు ప్రశాంతం

**విశాలాంధ్ర-పెదగంట్యాడ :** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎంఎల్ సి ఎన్నికలు సందర్భంగా పోలింగ్ సరళిని గాజువాక నియోజక వర్గ శాసన సభ్యులు, రాష్ట్ర టీడీపి అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు పర్యవేక్షించారు. గాజువాక నియోజకవర్గ పరిధిలోని 64 ,72, 73, 74, 75, 76 వార్డులకు సంబంధించిన ఓటర్ల కోసం 75వ వార్డు పరిధిలో నడుపూరు హైస్కూల్లో ఓటింగ్ కేంద్రం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి, 76 వ వార్డు కార్పొరేటర్ శ్రీ గంధం శ్రీనివాస రావు, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద రెడ్డి, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి రెడ్డి పాల్గొన్నారు. పెదగంట్యాడ పోలింగ్ కేంద్రంలో నాలుగు గంటల సమయానికి 101 ఓట్లకు 98 ఓట్లు పోలయ్యాయి. గాజువాక పోలింగ్ కేంద్రంలో 708 ఓట్లకు గాను 616 ఓట్లు పోలయ్యాయి. కార్యక్రమంలో టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, టీడీపీ జనసేన నాయకులు నమ్మి అప్పారావు కోన చిన అప్పారావు, కొండబాబు, పెద్దాడ సోమునాయుడు, గోక్యాడ ముత్యాలు ఉగ్రం,రాజు, సుదర్శన్, జ్యోతి రెడ్డి ములకలపల్లి పెంటయ్య, గంట్యాడ పోలయ్య, శ్రీముసిరి శ్రీనివాసరావు, పెంటి రాజు, బాలు నాయుడు, హరి కృష్ణ, వెంకన్న, పెరుమాళ్, అప్పారావు, రమణ బాబు, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### పోలింగ్ పరిశీలించిన ప్రణవ్ గోపాల్

**విశాలాంధ్ర-విశాఖ :** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎం ఎల్ సి ఎన్నికలకు సంబంధించి వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ తాడేపల్లి గూడెంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న నాయకులతో చర్చించారు. ప్రతీ పట్టభద్రుడు ఓటింగ్ లో పాల్గొనేలా చూడాలని, నియోజక వర్గంలో దాదాపుగా 70 శాతానికి పైగా ఓటింగ్ జరిగేలా చూడాలని సూచించారు.

## కామ్రేడ్ పి. రాజు మృతి పట్ల మెసేన్ సంతాపం



**విశాలాంధ్ర-విశాఖ :** పోర్టు అండ్ డాక్ వాటర్ ఫ్రంట్ ఫెడరేషన్ అఫ్ ఇండియా కార్యదర్శి పి రాజు మరణం పట్ల ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి, విశాఖపట్నం పోర్టు అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బీ సీహెచ్ మెసేన్ గురువారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కేరళకు చెందిన కామ్రేడ్ పి రాజు (73) గురువారం అనారోగ్యంతో కేరళలోని కొచ్చిలో మరణించారు. ఆయన మృతి పోర్టు అండ్ డాక్ వాటర్ ఫ్రంట్ ఫెడరేషన్ అఫ్ ఇండియాకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# భాస్కర్ విద్యా నికేతన్ స్కూల్ లో హెల్దీ ఫుడ్ ఫెస్టివల్...

డాక్టర్ పి హేమలత

**విశాలాంధ్ర-పెదగంట్యాడ** : 70వ వార్డు చట్టివానిపాలెం భాస్కర్ విద్యా నికేతన్ స్కూల్ లో గురువారం విద్యార్థులచే పౌష్టికాహార కార్యక్రమం నిర్వహించారు. పెదగంట్యాడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ పి హేమలత ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యక్రమం ప్రారంభించి, విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. ఆమె మాట్లాడుతూ ఈరోజుల్లో రకరకాల రుచులకు అలవాటు పడి ఇంట్లో అమ్మ చేసిన వంటలు కాకుండా బయట వివిధ రసాయనాలు ఉపయోగించి చేసిన పదార్థాలు తినడం వల్ల అనారోగ్యం పాలౌతున్నారని కనుక అమ్మ వండిన పదార్థాలే ఎక్కువుగా తినాలని, ప్రతీ రోజూ వ్యాయామం తప్పక చెయ్యాలని, ఆరోగ్యమే మహా భాగ్యం అని సూచించారు. మరో అతిథి మెడివరల్డ్ హాస్పిటల్ న్యూట్రిషన్ డాక్టర్ నేహా పర్వీన్ సందర్శించి మాట్లాడారు. ప్రోటీన్స్, విటమిన్స్, కార్బోహైడ్రేట్స్ కలిగిన కల్తీ లేని ఆహార పదార్థాలు ఆకుకూరలు, పండ్లు, కాయకూరలు, చిరు ధాన్యాలు, గింజలు ప్రతీ రోజూ తీసుకోవాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కర్ రావు మాట్లాడుతూ చాలా మంది చిన్న వయస్సు లోనే అనారోగ్యము పాలవడానికి ప్రధాన కారణం పౌష్టికాహార లోపం అని అందుకనే పౌష్టికాహారం పై విద్యార్థులకు అవగాహన కల్పించుటకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఏ ఏ ఆహార పదార్థాల్లో ఏ ఏ పోషక విలవలున్నాయో ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో మంచి ఆరోగ్యన్ని ఇచ్చే చిరుదన్యాలు, రాగి జావా, మొక్కజొన్న, ఆకు కూరలు, పండ్ల రసాలు, వివిధ రకాల, వంట నూనెలు, కూరగాయలు, మొలకలు మరియు చెడు ఆరోగ్యనిచ్చే నిలువ ఆహార పదార్థాలు, చల్లని పానీయలు తీసుకోరాదని మొదలైన సుమారు 50రకాల అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమం పాఠశాల ఉపాధ్యాయినులు అమరావతి,శిరీష, శ్వేత, మేరీ, దివ్య, రాణి తదితరుల ఆధ్వర్యం లో నిర్వహించగా కరెస్పాండంట్ పి రమాదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు జిప్సా అధ్యక్షుడు బి శ్రీనివాస్, కార్యదర్శి యస్ షణ్ముఖ రావు, వివిధ పాఠశాల ల కరెస్పాండంట్స్ జగ్గారావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహనకు ప్రత్యేక కార్యక్రమం

## 13 పాఠశాలల్లో 8125 మందిలో స్ఫూర్తి నింపిన గీతం బృందం

**విశాలాంధ్ర-మధురవాడ:** దేశం గర్వించ తగ్గ శాస్త్రవేత్తలు తయారుకావాలంటే విద్యార్థి దశలోనే అందుకు తగ్గ స్ఫూర్తి, ప్రేరణ అవసరమని భావించి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజి కమ్యూనికేషన్ (ఎన్‌సిఎస్‌టిసి) విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమం పాఠశాల విద్యార్థులలో స్ఫూర్తిని నింపుతోంది. గీతం తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారులు చేతులు కలపడంతో "లెట్ అజ్ డు సైన్స్" పేరిట గత మూడు నెలలలో 13 ప్రభుత్వ పాఠశాలలలో 8125 మంది విద్యార్థులను ప్రభావితం చేసింది. ఫిబ్రవరి 28వ తేదీ జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా దీనిపై ప్రత్యేక కథనం. విద్యార్థుల లో నూతన ఆలోచనలను రేకెత్తించే విధంగా సైన్స్ ప్రయోగాలను ప్రభుత్వ పాఠశాలలలో ఆసక్తి కరంగా చేసి చూపించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం "లెట్ అజ్ డు సైన్స్" పేరిట ఈ ప్రాజెక్టును అమలుచేస్తోంది. జిల్లా విద్యా శాఖతో కలసి ఆనందపురం, నరవ, చంద్రం పాలెం, చింతల అగ్రహారం, పెందుర్తి, తగరపు వలస, భీమిలి, మద్దిలపాలెం, కొమ్మాది, ఎన్ఏడి, కె.కోటపాడు, విజయనగరం తదితర ప్రాంతాలలో గల జిల్లా పరిషత్ మరియు ఇతర పాఠశాలలలో సైన్స్ కార్యక్రమాలను చేపట్టారు. గీతం విశ్వవిద్యాలయం నుంచి 33మంది, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి 24 మంది, గాయత్రి విద్యా సంస్థ నుంచి ఒకరు మొత్తం 58 మంది పిజి యుజి విద్యార్థులను ఒక బృందంగా ఏర్పాటు చేశారు. భౌతిక రసాయన శాస్త్రాలతో పాటు కంప్యూటర్ సైన్స్, బయోటెక్నాలజి, ఫార్మశీ, సైకాలజి, నర్సింగ్, మైక్రోబయాలజి వంటి అంశాలలో ఆసక్తికరమైన విజ్ఞాన శాస్త్ర ప్రయోగాల జాబితాను రూపొందించారు. ఈ బృందానికి గీతం భౌతిక శాస్త్ర విభాగం అధ్యాపకురాలు డాక్టర్ బి.స్పందన ఆమెతో పాటు గీతం ఇంజనీరింగ్, సైన్స్ కళాశాలలకు చెందిన డాక్టర్ వి.వి.కె.లక్ష్మి, డాక్టర్ కె.నవీన్‌కుమార్, డాక్టర్ కె.ఆదర్శకుమార్, డాక్టర్ పి.కనకరాజు, సైన్స్ ఎడ్యుకేటర్స్ ఉదయ కాళేశ్వరరావు గుప్తా, బి.శ్రావణి నేతృత్వం వహించారు. పాఠశాల విద్యార్థులకు విజ్ఞానశాస్త్ర విశేషాలను వివరించడానికి, వారిలో ఆసక్తి పెంచడానికి పాఠ్య పుస్తకాలలోని అంశాలకు తగినట్లుగా చిన్న, చిన్న సైన్స్ ప్రయోగాల జాబితాను తయారు చేశారు.

ఇళ్ళలో ఉపయోగించే మిక్సర్, వాషింగ్ మిషన్, ఫ్యాన్, హీటర్, క్యాలికులేటర్ ఎలా పనిచేస్తాయో వాటి వెనక ఉపయోగించే శాస్త్ర విజ్ఞానం వివరిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అలాగే నిత్య జీవతంలో రక్తం నమూనాలను పరిశీలిం చడం, వివిధ రకాల పరీక్షలు, వ్యాధి నిర్ధారణ వంటి అంశాలను తెలియజేశారు. వీటితో పాటు సూర్య గ్రహణం, చంద్రగ్రహణం ఏర్పడే విధానం వంటి అంశా లతో పాటు నూతన సంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్‌లు ఎగిరే సాంకేతికత, రోబోలు పనిచేసే తీరు వంటివి పాఠశాలలలో విద్యార్థులకు ఆసక్తికరంగా వివరించడంలో విజయం సాధిం చారు. పాఠశాలల నుంచి వస్తున్న అనూహ్య స్పం దన దృష్టిలో ఉంచికుని విద్యాశాఖ సహకారంతో మరికొన్ని పాఠశాలలకు వెళ్ళనున్నట్లు డాక్టర్ స్పందన తెలిపారు. అలాగే అధ్యాపకులకు ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించే ఉద్దేశ్యంలో ఉన్నామన్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం మరికొన్ని పాఠశాలలకు విస్తరించడానికి స్ఫూర్తిని ఇస్తోందని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి పేర్కొన్నారు.

# సీఈపీటీ వర్శిటీలో టెక్నాలజీ ఫ్యాకల్టీ యూజీ, పీజీ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

**విశాలాంధ్ర-విశాఖపట్నం:**1982లో స్థాపించబడిన సీఈపీటీ విశ్వవిద్యాలయంలోని టెక్నాలజీ ఫ్యాకల్టీ (ఎఫ్‌టీ), గతంలో స్కూల్ ఆఫ్ బిల్డింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్‌బీఎస్‌టీ)గా పిలువబడేది. ఇప్పుడు 2025 విద్యాసంవత్సరం కోసం. యూజీ, పీజీ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సివిల్ ఇంజనీరింగ్, బిల్డింగ్ ఎనర్జీ పెర్ఫార్మెన్స్, జియోమాటిక్స్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ డిజైన్, కన్స్ట్రక్షన్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ వంటి ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న రంగాల అవసరాలపై దృష్టి సారించి, ఎఫ్‌టీ వారి సమస్య పరిష్కారం, ఫలితాల ఆధారిత బోధనకు ప్రసిద్ధి చెందిన ప్రత్యేకమైన ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. స్టూడియో ఆధారిత ప్రాజెక్టుల ద్వారా ఆచరణాత్మక అభ్యాసంపై బలమైన ప్రాధాన్యతతో కలిపిన ఈ విధానం, వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ మౌలిక సదుపాయాలు మరియు నిర్మిత పర్యావరణ రంగాలలో పరిశ్రమ నాయకులు ఎక్కువగా కోరుకునే నైపుణ్యాలు మరియు జ్ఞానాన్ని గ్రాడ్యుయేట్లకు అందిస్తుంది.

# స్ట్రాంగ్ రూమ్ కు చేరుకున్న పోలింగ్ సామాగ్రి...

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం :** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆయా జిల్లాల నుంచి ఎన్నికల సామాగ్రి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ కు చేరుకున్నాయి. బ్యాలెట్ యూనిట్లను అధికారులు దగ్గరుండి తీసుకురాగా స్థానిక అధికారులు పరిశీలించి స్వీకరించారు. ప్రక్రియను సహాయక రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ పర్యవేక్షించారు.

# ముకుందపురం, బోని లో భారీ అన్నదాన కార్యక్రమం

## మండలంలో పలుచోట్ల శివాలయాల్లో అన్న ప్రసాదాల పంపిణీ

**విశాలాంధ్ర-ఆనందపురం:** ఆనందపురం మండలం ముకుందపురం గ్రామపంచాయతీలో మహాశివరాత్రి సందర్భంగా గురువారం శివాలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సుమారు 3 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అలాగే బోని ,శివాలయంలో, మండలంలో పలు ఆలయాల్లో మహా శివరాత్రి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించామని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కలిమి. గంగరాజు, జానకిరామరాజు, ముకుందపురం గ్రామ ప్రజలు పెద్దలు ఆలయ ఉత్సవ కమిటీ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ పోలింగ్ సరళిని పరిశీలించిన గంటా....

**విశాలాంధ్ర-పీఎం పాలెం** : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. అందులో భాగంగా చంద్రంపాలెం హైస్కూల్ లోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. కూటమి బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా చంద్రంపాలెం, భీమిలి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల వద్ద పార్టీ నాయకులతో కొంతసేపు మాట్లాడారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భీమిలి జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, భీమిలి పార్టీ అధ్యక్షుడు డి.ఎ.ఎన్. రాజు, పిల్లా వెంకట్రావు, మొల్లి లక్ష్మణరావు, మన్యాల సోంబాబు, గరే గుర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు మధురవాడలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాంధ్ర-మధురవాడ : తేదీ 28.02.2025 శుక్రవారం ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు మధురవాడ సబ్ స్టేషన్ పరిధి లోగల 11కే. వీ. నగరంపాలెం (ఇంటెగ్రల్ ) ఫీడర్ పై మరమ్మత్తుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయడంష జరగుతుందని విద్యుత్. జోన్. 1 ఎగ్జిక్యూటివ్, ఇంజినీర్, ఆపరేషన్, పోలాకి శ్రీనివాసరావు శుక్రవారం వో ప్రకటపలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు. గణేష్ నగర్, పోర్ట్ కోలనీ, కళనగర్, బొట్టవానిపాలెం, స్వతంత్రనగర్, డాక్ యార్డ్ కోలనీ,వాంబే కోలనీ, శ్రీనివాస్ నగర్,నగరం వై.ఎస్.ర్ కాలనీ, గాయత్రీ విద్య హాస్పిటల్, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ,శివశక్తి నగర్ రోడ్,అయ్యప్పనగర్,శ్రీ లక్ష్మి నగర్, సద్గురుసాయి నాథ్ కాలనీ,గణేశనగర్ రోడ్, మొదలైన ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదు. ఆ యా ప్రాంతపులకు వినియోగ దారులు తమతో సహకరించాలని ఆయన తన ప్రకటనలో కోరారు.

# శివరాత్రి జాగరణ పుణ్య స్నానాలకు పోటెత్తిన భక్తులు...

**విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం** : శివరాత్రి సందర్భంగా జాగరణ పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. గురువారం వేకువ జాము నుండే విశాఖసాగర తీరంలో భక్తజన సముద్రం తీరంవెంబడి అధిక సంఖ్యలో స్నానాలకు తరలివచ్చారు. ఆర్కేబీచ్, తెన్నేటి పార్క్,సీతకొండ, రుషికొండ,తొట్లకొండ,భీమిలి తీరాలలో భక్తిశ్రద్ధలతో శివరాత్రి స్నానాలు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలు చేపట్టారు. మరోపక్క సాగర తీరం ఆర్కే బీచ్ వద్ద అధిక నందడి నెలకొంది. శివరాత్రి సందర్భంగా రాత్రంతా జాగారాలు ఉండి ఉదయం సముద్ర స్నానాలు చేయడంతో ఆ ప్రాంతం రద్దీగా మారిపోయింది.

# పద్మనాభంలో శత శాతం పోలింగ్

విశాలాంధ్ర-పద్మనాభం: మండల కేంద్రమైన పద్మనాభంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 121 పోలింగ్ కేంద్రంలో గురువారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. దీనిలో భాగంగా 85 మంది ఓటర్ లెక్కను 84 మంది ఓట్లు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో మహిళలు 15 మంది. పురుషులు 70 మంది. మహిళలు పూర్తిగా 15 మంది ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. పురుషులు 69 మంది ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రానికి సమీపంలో ప్రధాన శిబిరాలుగా మొదట శిబిరం పిడిఎఫ్ అభ్యర్థి అయిన ఆ విజయ్ గౌరి. ఆ రెండు ఆ శిబిరం కుటమీ అభ్యర్థి అయిన రఘువర్మ శిబిరం. మూడవ అభ్యర్థి అయిన శ్రీనివాసులు నాయుడు సబిరాలను ఉన్నాయి. రఘువర్మ శిబిరంలో అత్యధికంగా తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. అయితే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలో జరగకుండా ప్రశాంత వాతావరణంగా ఎన్నికలు జరిగాయి. స్థానిక సీఐ సిహెచ్ శ్రీధర్ ఎస్సై సురేష్ . మరో 10 మంది సిబ్బంది పహారా లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించారు ఎన్నికల అధికారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

# ఎమ్మెల్సీ ఓటింగ్ పోటెత్తిన ఓటర్లు

**విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ :** ఉత్తరాంధ్ర జిల్లా ల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగిన పోలింగ్ లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ స్థానంలో 10 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో పాకలపాటి రఘువర్మ (ఏపీటీఎఫ్), గాదె శ్రీనివాసులునాయుడు (పీఆర్టీయూ), విజయగౌరి (యూటీఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల పరిధిలో పోలింగ్ ముగిసే సమయానికి ఓటింగ్ శాతం 92.39 నమోదైంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా లో పోలింగు ముగిసే సమయానికి 96.19 శాతం నమోదయింది. చీడికాడ రోలుగుంట మాకవరపాలెం ఎస్ రాయవరం మండలాల్లో 100 శాతం పోలింగ్ నమోదయింది. విశాఖ జిల్లాలో 87.34% ఓటింగ్ జరిగింది.నబ్బవరం లో 98.94, దేవరపల్లిలో 98.41, రావికమతం ,నక్కపల్లి లలో 98.08 శాతం ఓటింగ్ జరిగింది. ఎన్నికల్లో ఎటువంటి గందరగోళం, అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలు జరగపోవడంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.